
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
22-6-2026 (Monday) MAIN EDITION

## రక్షణ మంత్రిని కలిసిన సీఎం



**అక్షరటుడే, ఢిల్లీ:** భారత వాయు సేన ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో ఆయనతో సోమవారం భేటీ అయ్యారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు అంశాల్లో పూర్తిగా సహకరిస్తామని చెప్పారు.

## రైతు భరోసా ఎగ్గొట్టిన సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్:** అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి మూడు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో సోమవారం ఆయన పర్యటించారు. రైతులతో మాట్లాడారు. రైతు సమస్యలు తెలుసుకున్నారు. యూరియా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా సరిగ్గా ఇవ్వకపోగా, రైతుబంధు, బోనస్ లాంటివి కూడా ఎగ్గొట్టిందని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బ్రిటన్ ప్రధాని రాజీనామా



అక్షరటుడే, నేషనల్ డెస్క్: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా చేశారు. లేబర్ పార్టీ ఒత్తిడి వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పదవిలో ఉన్నంత కాలం విలువలకు కట్టుబడి పని చేసినట్లు తెలిపారు. బ్రిటన్‌లో గత పదేళ్లలో ఆరుగురు ప్రధానులు రాజీనామా చేశారు. కీర్ స్టార్మర్ 2024లో బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.

## పాఠశాల భవనం కూల్చివేత




అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్ నార్సింగిలో నిబంధనలకు విరుద్ధంగా మూసీ నది పరివాహక ప్రాంతంలో నిర్మించిన "ది బాంబిని క్రీక్" స్కూల్ భవనాన్ని రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. జూలై 3 వరకు గడువున్నా ముందే కూల్చడం అన్యాయమని, విద్యార్థుల భవిష్యత్తు ఏంటని పాఠశాల యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేసింది.

## భారీ వర్షం



అక్షరటుడే, హైదరాబాద్ : రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. వానాకాలం సీజన్ ప్రారంభం అయిన తర్వాత తొలిసారి వాన దంచికొట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో వాతావరణం చల్లబడి ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. నిర్మల్ జిల్లా కడెం మండలంలో గాలి వాన బీభత్సం సృష్టించింది.

## ఖతార్ రస్‌లఫాన్‌లో భారీ పేలుడు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్** : ఖతార్‌లోని రస్‌లఫాన్ చమురు ఎక్స్‌పోర్టు టెర్మినల్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 54 మంది తీవ్రంగా గాయపడగా, మరో 18 మంది ఆచూకీ లభించలేదు. రాస్ లఫాన్ ఇండస్ట్రియల్ సిటీలో పేలుడు 'సాంకేతిక లోపం' వల్లే సంభవించిందని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఖతార్‌లోని ప్రధాన ద్రవీకృత సహజ వాయువు శుద్ధి కర్మాగారంలో జరిగిన పేలుడులో 54 మంది గాయపడగా, మరో 18 మంది గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. గల్లంతైన వారి కోసం ఖతారీ అంతర్జాతీయ శోధన, సహాయక బృందాలు గాలిస్తున్నాయి.

## ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం

**అక్షరటుడే, హైదరాబాద్** : హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై సోమవారం ఉదయం ఓ ఇన్నోవా కారు డివైడర్‌ను, మరో కారును ఢీకొంది. నగర శివారు కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇన్నోవా కారు డివైడర్‌ను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. డ్రైవర్ నిద్రపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, వారిని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

***జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పరకాల-భూపాలపల్లి హైవేపై వాహనాలు తనిఖీ చేస్తుండగా అధికారులపైకి బొగ్గు టిప్పర్ దూసుకొచ్చింది. ఈ ఘటనలో జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో) వెంకన్న మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.*** - ***అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి***

# టిప్పర్ ఢీకొని

# డీటీవో మృతి



- వాహనాలు తనిఖీ చేస్తుండగా ఘటన
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం
- విచారణకు ఆదేశించిన మంత్రి పొన్నం

డీటీవో వెంకన్న ఆధ్వర్యంలో అధికారులు సోమవారం ఉదయం జయశంకర్ డీటీవో కార్యాలయం ఎదుట వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో ఓ బొగ్గు టిప్పర్ వేగంగా వారిపైకి దూసుకొచ్చింది. దీంతో డీటీవో వెంకన్న తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన మృత దేహం పూర్తిగా నుజ్జు నుజ్జు అయింది. కాగా ఆయన 15 రోజుల క్రితమే భూపాలపల్లికి బదిలీపై వచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### లారీలతో తొక్కించి చంపేస్తారా

డీటీవో వెంకన్న మృతిపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. ఇసుక, బొగ్గు మాఫియాలకు అడ్డొస్తే లారీలతో తొక్కించి చంపిస్తారా అని ప్రశ్నించారు. భూపాలపల్లి డీటీఓ వెంకన్న ప్రమాదం వెనుక దాగిన నిజాన్ని వెలికితీయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అధికారులను బెదిరిస్తూ అక్రమ దందాలు సాగిస్తున్న ఇసుక మాఫియా, బొగ్గు మాఫియా వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

### సీఎం దిగ్భ్రాంతి

భూపాలపల్లిలో విధి నిర్వహణలో ఉన్న డీటీవో వెంకన్న మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వెంటనే నివేదిక ఇవ్వాలని రవాణా శాఖ జాయింట్ కమిషనర్‌ను ఆదేశించారు. వెంకన్న కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు.

### విచారణకు ఆదేశం

డీటీవో వెంకన్న మృతిపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. వెంకన్న మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## పర్యాటక కేంద్రంగా భువనగిరి కోట : మంత్రి జూపల్లి




**అక్షరటుడే, హైదరాబాద్** : భువనగిరి కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. కోటలో అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అధికారులతో పనులపై సమీక్షించారు. కోటలో రోప్‌వే, హోటల్, పార్కింగ్ సదుపాయాలు, విశ్రాంతి గదులు, పిల్లల ఆటస్థలం, కోట పునరుద్ధరణ పనులు, కెఫెటేరియా, ఇంటర్‌ప్రెటేషన్ సెంటర్ మరియు ఇతర పర్యాటక సౌకర్యాలతో సహా కొనసాగుతున్న ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. అక్టోబర్ 2 నాటికి అన్ని పనులను పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. చారిత్రక వైభవాన్ని కాపాడుతూనే భువనగిరి కోటను ఆధునీకరిస్తున్నామని ఆయన తెలిపారు. యాదాద్రి, భువనగిరి కోట మరియు కొలనుపాకలను అనుసంధానిస్తూ సమగ్ర ఆధ్యాత్మిక మరియు వారసత్వ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన చెప్పారు.

## మత్తుకు దూరంగా ఉండాలి : మంత్రి శ్రీహరి



**అక్షరటుడే, మహబూబ్‌నగర్ :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో రూ.12.53 కోట్లతో చేపట్టనున్న క్రీడా మౌలిక సదుపాయాల పనులకు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి సోమవారం శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ క్రీడాకారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా జీవన శైలిని మార్చే శక్తివంతమైన సాధనం అని ఆయన అన్నారు. ప్రతి యువకుడు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలి అని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, మైదానాల్లో సమయం వెచ్చించాలన్నారు.

## ఇంట్లోకి దూసుకెళ్లిన కంటైనర్.. ఒకరి మృతి



**అక్షరటుడే, నల్గొండ** : ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిపైకి కంటైనర్ రూపంలోకి మృత్యువు దూసుకొచ్చింది. నల్గొండ జిల్లా వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. బుగ్గబావిగూడెం గ్రామంలో వెంకన్న అనే వ్యక్తి ఇంట్లో నిద్రిస్తున్నాడు. అయితే ఆదివాం రాత్రిపూట ఓ మినీ కంటైనర్ అదుపు తప్పి ఇంట్లోకి దూసుకెళ్లింది. వెంకన్నపైకి వాహనం ఎక్కడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వేములపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఒకే కుటుంబంలో నలుగురి ఆత్మహత్య



**అక్షరటుడే, చిత్తూరు:** చిత్తూరు జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. తన భార్య, ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చి.. ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చిత్తూరు జిల్లా దిగుమసపల్లె పంచాయతీ బంగారెడ్డిపల్లిలో దామోదరం(30) అనే వ్యక్తి జీవిస్తున్నాడు. ఆయనకు భార్య నిర్మల(25), కుమారుడు రాజేష్, కుమార్తె శ్రీవిద్యకు ఉన్నారు. అయితే భార్య నిర్మల ఆరోగ్యం సరిగా ఉండటం లేదు. ఆర్థిక ఇబ్బందులు సైతం ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో దామోదరం మొదట తన భార్య, పిల్లలకు విషమిచ్చాడు. వారు చనిపోయాక తాను ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

## తల్లి మందలించిందని.. ఇంట్లోంచి వెళ్లిపోయిన అక్కాచెల్లెళ్లు

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** తల్లి మందలించిందని ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటన హైదరాబాద్ నగరంలో చోటు చేసుకుంది. ఫలక్‌నుమాకు చెందిన ముగ్గురు మైనర్ అక్కాచెల్లెళ్లు నిత్యం ఫోన్ ఎక్కువగా వాడుతున్నారు. ఫోన్‌కు బానిస కావడంతో వారిని ఇటీవల తల్లి మందలించింది. దీంతో ముగ్గురు కలిసి ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. ముగ్గురు బిడ్డలు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్.శ్రీనివాస్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి, అర్ధరాత్రి వరకు స్టేషన్‌లోనే ఉండి దర్యాప్తును పర్యవేక్షించారు. ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఏలూరులో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం వారిని సురక్షితంగా రక్షించి, తల్లిదండ్రులకు అప్పగించారు.

## నీట్ రీ ఎగ్జామ్‌లో స్కామ్.. 30 మంది అరెస్ట్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** నీట్ రీ ఎగ్జామ్‌లో మరో భారీ స్కాం బయట పడింది. పరీక్షలకు మోసాలకు పాల్పడేందుకు యత్నించిన 30 మందిని బీహార్ పోలీసులు అరెస్ట్ చేశారు. బీహార్‌లోని పలు పరీక్షా కేంద్రాలలో వేరొకరి స్థానంలో పరీక్ష రాయడం, మోసాలకు సంబంధించిన ఘటనలు వెలుగు చూశాయి. నీట్ యూజీ పునఃపరీక్ష సందర్భంగా జిల్లా యంత్రాంగం, పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. తనిఖీల సమయంలో మొత్తం 30 మందిని అరెస్టు చేశారు. వీరిలో అసలు అభ్యర్థుల స్థానంలో పరీక్ష రాస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తొమ్మిది మంది కూడా ఉన్నారు.

## కారుపై కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం



**అక్షరటుడే, హైదరాబాద్** : హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లో ఎస్‌యూవీపై ఒక భారీ చెట్టు కూలింది. నగరంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. అయితే వివేకానంద నగర్ మీదుగా వెళ్తున్న ఎస్‌యూవీ కారుపై ఒక్కసారిగా భారీ వృక్షం పడిపోయింది. దీంతో వాహనం ధ్వంసమైంది. అయితే లోపల ఉన్నవారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి.

## సంధ్యా థియేటర్ తొక్కిసలాట కేసు విచారణ వాయిదా



**అక్షరటుడే, సినిమా డెస్క్** : సంధ్యా థియేటర్ తొక్కిసలాట కేసు విచారణను కోర్టు జులై 6కు వాయిదా వేసింది. ఈ కేసులో సోమవారం విచారణకు హాజరు కావాలని నాంపల్లి కోర్టు ఇటీవల హీరో అల్లు అర్జున్‌తో పాటు పలువురికి సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో 12 నిందితులకు కోర్టు సమన్లు జారీ చేసింది. అల్లు అర్జున్ హాజరుకానందున మెమో దాఖలు చేయాలని కోర్టు సూచించింది. విచారణలో భాగంగా నాంపల్లి కోర్టుకు 12 మంది నిందితులు హాజరు అయ్యారు. బన్నీ తరపు న్యాయవాదులు ఆబ్సెంట్ పిటిషన్ దాఖలు చేశారు.